క్లుప్తంగా

హోం మంత్రిని కలిసిన ఏడుకొండలు

గోకవరం: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితను వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు శనివారం కొవ్వూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఆయనను ఎస్సీ సెల్ జోన్ ఇన్‌చార్జిగా నియమించడంపై మంత్రికి కృతజ్ఞతలు తెలపారు. ఆయన వెంట న్యాయవాది దాకే రఘు, నాయకులు మచ్చా మోహన్, పి.రమేష్ తదితరులు ఉన్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

సీతానగరం: రఘుదేవపురం శ్రీషిర్డీ సాయి మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు శ్రీవెంకటేశ్వర కాకతీయ కమ్మ సంఘం అధ్యక్షుడు కందుల హరి శ్రీనివాస్, కార్యదర్శి ఈడుగంటి సత్యనారాయణ (చిట్టిబాబు)లు శనివారం తెలిపారు. శ్రీవెంకటేశ్వర కమ్మ సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ శిబిరం వేమగిరి చెందిన శ్రీపరమహంస యోగానంద కంటి ఆసుపత్రి పర్యవేక్షణలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరుగుతుందన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

బిక్కవోలు: ఊలపల్లికి చెందిన గేదెల శ్రీనివాస్ ఇటీవల మృతి చెందారు. దీంతో శ్రీనివాస్ కుటుంబసభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేలు ఎంపీటీసీ సభ్యుడు బండారు శివ శనివారం అందించారు. మిగిలిన రూ.90 వేలు నేరుగా వారి ఖాతాలో జమవుతుందని ఆయన తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అనపర్తి: రాజానగరం మండలం మల్లంపూడిలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అఖిల తెలిపారు. విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ లిస్ట్ ఆధారంగా వారికి ప్రవేశం కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు గాను 93815 96322 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

30న వాహనాల వేలం

రంగంపేట: మండలంలో సారా రవాణాలో స్వాధీనం చేసుకున్న వాహనాలకు వేలం నిర్వహిస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జి.వెంకటలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రంగంపేట స్టేషన్ పరిధిలోని రెండు ద్విచక్ర వాహనాలకు ఈ నెల 30వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు రంగంపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ వద్ద వేలం వేస్తామన్నారు. వేలంలో పాల్గొనేవారు తమ ఆధార్‌కార్డు జిరాక్స్‌తో పాటు ధరావత్తు సొమ్ము చెల్లించాలన్నారు.

రక్తదాన శిబిరం

మధురపూడి: యువత రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవడం అభినందనీయమని వికాస్ ఫార్మసీ కాలేజీ చైర్మన్ తన్నీరు చిన్న సుబ్బారావు అన్నారు. శనివారం కోరుకొండ మండలం విమానాశ్రయం సమీపంలోని వికాస్ ఫార్మసీ కాలేజీలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జక్కంపూడి రామ్మోనరావు ఫౌండేషన్, ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్, రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్యకళాశాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని సబ్బారావు ప్రారంభించారు. వికాస్ ఫార్మసీ గైట్ ఫార్మసీ, వీజేఎస్ ఫార్మసీ కాలేజీలకు చెందిన 100 మంది విద్యార్థులు రక్తదానం చేశారన్నారు. రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి, డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ రక్తదానం చేసిన వారికి యోగ్యతాపత్రాలను ఇచ్చారు. వికాస్ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సుమలత, డాక్టర్లు పాల్గొన్నారు.

రూ.25 వేల ఆర్థిక సాయం

అనపర్తి: అనపర్తి నుంచి కొత్తూరు వెళ్లే రహదారిలోని కొప్పసాని చెరువు వద్ద తూరల ఏర్పాటుకు గాను వైఎస్సార్ సీపీ రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక కనకదుర్గ రజక సంఘానికి చెందిన రజకులు కొప్పసాని చెరువును బట్టలు ఉతికేందుకు వినియోగిస్తున్నారు. అయితే వానా కాలంలో కురిసే భారీ వర్షాలకు చెరువులో నీరు బయటకు పోయే మార్గం లేక దశాబ్ద కాలంగా రజకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తూరల ఏర్పాటుకు గాను తన సొంత సొమ్ము రూ.25 వేలు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి చేతుల మీదుగా రజక సంఘం ప్రతినిధులకు అందజేశారు. పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ కర్రి దాను, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శి పడాల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోర్డులు ఏర్పాటు చేయండి

మధురపూడి: ఉపాధి హామీ పథకం పనులు పూర్తయిన ప్రాంతాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని ఉపాధి హామీ పథకం పీడీ రామ్ గోపాల్ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై గ్రామాల్లో నిర్వహించిన సోషల్ ఆడిట్‌పై ప్రజావేదిక జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మండలంలో 10,32,39,470 ఉపాధి హామీ పనులు జరిగాయి. గత 10 రోజులు గ్రామాల వారీగా సామాజిక తనిఖీలు నిర్వహించి, చివరి రోజున మండల కేంద్రంలో ప్రజావేదిక నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఘనంగా వారాహి నవరాత్రులు

బిక్కవోలు: కొంకుదురులో వారాహి నవరాత్రుల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు రమణశర్మ స్వగృహం వద్ద వారాహి పీఠాన్ని ఏర్పాటు చేసి నవరాత్రుల కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ముఖ నక్షత యుక్త పంచమి తిథి సందర్భంగా శుక్రవారం రాత్రి అమ్మవారికి ఘనంగా కుంకుమార్చన చేశారు

శ్రీరస్తు... ఆరోగ్యమస్తు

- సీహెచ్‌సీగా సీతానగరం పీహెచ్‌సీ
- బొబ్బిల్లంకలో పీహెచ్‌సీ ఏర్పాటు
- మండలంలో మెరుగైన వైద్య సేవలు



బొబ్బిల్లంకలో ముస్తాబైన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం

సీతానగరం: సుస్తీ చేస్తే పెద్దాసుపత్రులకు పరుగు లెట్టే రోజులు పోయాయి.. ప్రజలకు అందుబాటులోకే వైద్యం వచ్చింది.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది.. తద్వారా ఆరోగ్యానికి అభయం ఇచ్చింది.. ప్రతి పంచాయతీలో వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు.. పీహెచ్‌సీల్లో అదనపు సౌకర్యాలు, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా వైద్య సేవలు దరిచేర్చింది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. సీతానగరం మండలంలో 25 గ్రామాలు ఉన్నాయి. మండల కేంద్రంలోని సీతానగరం పీహెచ్‌సీ ద్వారా సుమారు 13 గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. గత టీడీపీ హయాంలో ఇక్కడ వైద్యులు, సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉండడంతో రోగులకు సరైన వైద్యం అందేదికాదు. రాజమహేంద్రవరం వంటి ప్రాంతాలకు వైద్యం కోసం వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ప్రభుత్వంలో ఈ పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులతో పాటు అవసరమైన సిబ్బందిని సమకూర్చారు. రోగులకు మెరుగైన వైద్యం అందుతోంది. ఈ పీహెచ్‌సీలో డాక్టర్లు ఏవీకే చైతన్య, డాక్టర్ ఎస్.రాజు సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా రోజుకో గ్రామానికి వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. అంతేకాకుండా ఇంటికెళ్లి మరీ రోగులను పరీక్షిస్తున్నారు. రోజుకు సుమారు 600 మందిని పరీక్షిస్తున్నట్లు ఆరోగ్య సిబ్బంది చెబుతున్నారు. గతంలో సీతానగరం పీహెచ్‌సీలో పెద్దగా ప్రసవాలు జరిగేవి కాదు. ఉత్తమ వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో ప్రసవాలు అధికంగా జరుగుతున్నాయి.

ప్రాధాన్యాన్ని గుర్తించి..

ప్రజల ఆరోగ్యం రక్షణ దృష్ట్యా సీతానగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మార్పు చేస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు ఇచ్చింది. త్వరలోనే దీనికి సంబంధించి రఘుదేవపురం రవీంద్రకాలనీ వద్ద ఉన్న ప్రభుత్వ స్థలంలో సీహెచ్‌సీ నూతన భవనం నిర్మించనున్నారు. ఈ పనులు చకచకా జరుగుతున్నాయి. ఇదిలాఉంటే బొబ్బిల్లంకలో కొత్తగా పీహెచ్‌సీ ఏర్పాటైంది. ఇక్కడ పీహెచ్‌సీ కొత్త భవనం నిర్మించే వరకూ ఖాళీగా ఉన్న పాత పంచాయతీ భవనంలో వైద్య సేవలు అందిస్తున్నారు. పీహెచ్‌సీలో డాక్టర్లు మేఘన, ఏసురాణి వైద్యం చేస్తున్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా మండలంలో అనేక మంది కార్పొరేట్ వైద్య సేవలు పొందారు.

వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు

మండలంలో వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌ల ద్వారా వైద్యం దరిచేరుతోంది. ఇక్కడ మొత్తం 19 వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ భవనాలు నిర్మించాల్సి ఉండగా, అందులో 8 భవనాలు పూర్తయ్యాయి. మిగిలిన 11 భవనాలు వివిధ దశలలో ఉన్నాయి. భవనాలు అందుబాటులోకి వచ్చిన చోట వైద్య సిబ్బంది సేవలు అందిస్తున్నారు. ఈ క్లీనిక్‌లలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్త ఉంటారు. వీరు ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలు తదితరులకు వైద్య సేవలు అందిస్తారు.



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఇంటి వద్దే రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ రాజు

ఇంటి వద్దకే వైద్య సేవలు

దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నేరుగా ఇంటకే వైద్యులు వెళ్లి సేవలు అందిస్తున్నారు. వీరు 104 వాహనం ద్వారా ఆయా గ్రామాలకు వెళ్లి సేవలందిస్తున్నారు. ఇది వైద్య రంగంలో విప్లవాత్మక మార్పుగా అందరూ కొనియాడుతున్నారు. వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు, సచివాలయాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని కొనసాగిస్తూనే, మంచంపై ఉండే రోగులకు నేరుగా ఇంటికెళ్లి వైద్యం చేసి ఉచితంగా మందులు ఇస్తున్నారు. అలాగే 108 అంబులెన్స్ సేవలను మరింత సమర్థవంతంగా మార్చారు.

మరింత చేరువగా వైద్యం



మండల ప్రజలకు మరింత చేరువగా వైద్య సేవలు వచ్చాయి. సీతానగరం పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్పు చేస్తున్నారు. త్వరలో 30 పడకల ఆసుపత్రి నెలకొల్పుతారు. ప్రస్తుత పీహెచ్‌సీలో పడకలు ఉన్నందున ప్రసవాలు జరుగుతున్నాయి. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రజల వద్దకే వెళ్లి సేవలు అందిస్తున్నాం. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుతున్నాం.

–ఏవీకే చైతన్య, పీహెచ్‌సీ వైద్యుడు, సీతానగరం

ప్రతి వారం పరీక్షలు



నాకు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం చేశారు. అక్కడ కార్పొరేట్ స్థాయిలో వైద్యం చేస్తున్నారు. గర్భిణిగా ఉన్న సమయంలో రక్తహీనత కలగకుండా మంచి మందులతో పాటు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి వైద్య సిబ్బంది వివరించేవారు. ప్రతి శుక్రవారం గైనకాలజిస్ట్ పరీక్షలు చేసేవారు. అవసరమైన మందులు ఇచ్చేవారు. వైద్య సిబ్బంది ఇంటికి వచ్చి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేవారు.

–ఆరుగోలు సువర్ణ, చినకొండేపూడి, బాలింత

ఇది మా అదృష్టం



గతంలో ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు ఉండేవారు కాదు. 30 కిలోమీటర్ల దూరంలోని రాజమహేంద్రవరానికి వెళ్లి వైద్యం చేయించుకునేవాళ్లం. ఇప్పుడా పరిస్థితి లేదు. సీతానగరం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు ఉండటంతో మంచి సేవలు పొందుతున్నాం. అన్నిరకాల మందులు ఉచితంగా అందిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటికే వైద్యులు వచ్చి సేవలు అందించడం మా అదృష్టం

–మట్టు సదానందనదేవి, సీతానగరం

వైభవంగా కూనలమ్మ అమ్మవారి జాతర



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే జక్కంపూడి

సీతానగరం: పన్నెండేళ్లకు ఒక్కసారి జరిగే కూనవరం శ్రీకూనలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం శనివారం వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారిని తూర్పు గోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ దర్శించుకున్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ కూనలమ్మ అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎప్పుడు ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్టు ఆయన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను, జక్కంపూడి గణేష్‌లను పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఎంపీడీఓ కె.రమేష్, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, ఎంపీటీసీ నల్లమోలు భాస్కర్, ఆయల కమిటీ మెంబర్ బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

నరసింహునికి సుదర్శన హోమం



స్వామివారి చిత్రపటాన్ని మాజీ ఎమ్మెల్యే రౌతుకు బహూకరిస్తున్న ట్రస్టు బోర్డు నాయకులు

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శనివారం సుదర్శన హోమం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ రౌతు సూర్యప్రకాశరావు దంపతులు ఆధ్వర్యంలో పండితులు ఈ హోమం చేశారు. ఈ సందర్భంగా అన్నవరం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యులు తాడి హరిశ్చంద్రప్రసాద్‌రెడ్డి, నరసింహస్వామి ఆలయ ఉద్యోగి రవికుమార్ స్వామివారి దేవస్థానం చిత్రపటాన్ని రౌతుకు బహూకరించారు. మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు పసుపులేటి బుల్లియ్యనాయుడు, సూరి రెడ్డి, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

సీతానగరం: వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్పందన ఎడ్యుకేషన్ అండ్ ఎంకరేజ్‌మెంట్ డీడ్ (సీడ్) కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు కన్నూరి సతీష్‌బాబు పాల్గొని విద్యార్థులకు విద్యా, భావోద్వేగ, ఆర్థిక నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఫౌండేషన్ సభ్యులు కె.ఝాన్సీ, ఇజ్జిన రాజ్‌కుమార్ హెచ్‌ఎం సీతారత్నం, ఉపాధ్యాయయులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజాను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న దక్షిణామూర్తి

కడియం: విద్యుత్ షాక్‌తో చేతి వేళ్లను కోల్పోవడంతోపాటు, శరీరంపై వివిధ చోట్ల 8 సర్జరీలు చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న చెరుకూరి దక్షిణామూర్తిది కడియం మండలం జేగురుపాడు గ్రామం. ఇటీవల సీఎం వైఎస్ జగన్ కొవ్వూరు వచ్చినప్పుడు ఆయనను కలిసి తన బాధలను వివరించారు. దీంతో దక్షిణామూర్తికి రూ.5.41లక్షలు సీయం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరు చేసి, చెక్కును అందజేశారు. ఈ నేపథ్యంలో దక్షిణా మూర్తి శనివారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్‌లను కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో సతమతమవుతున్న తనను సీఎం జగన్ ఆదుకున్నారని, ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటానని ఈ సందర్భంగా దక్షిణామూర్తి ఉద్వేగానికి గురయ్యారు. ఆయన్ను సముదాయించిన నేతలు ప్రతి పేదవాడికి సీఎం వైఎస్ జగన్ అండ ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీలకు అతీతంగా సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్నారని వివరించారు. తన సమస్యను వివరించిన వెంటనే స్పందించిన పార్టీ నాయకులు జక్కంపూడి రాజా, చందన నాగేశ్వర్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజులకు ఈ సందర్భంగా దక్షిణామూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

పేదోడికి న్యాయం చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కాపవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం



కాపవరంలో లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: పేదోడికి న్యాయం చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం కాపవరం గ్రామంలో రెండో రోజు ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు గత నాలుగేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అందిన సంక్షేమ లబ్ధిని వివరించి బుక్‌లెట్లను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ అర్హులైన ఏ ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధికి దూరం కాకూడదన్న లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరో ప్రతిష్టాత్మక కార్యక్రమానికి నాంది పలికిందన్నారు. అర్హత ఉన్నా కేవలం ధ్రువపత్రాలు లేవన్న కారణంలో లబ్ధి పొందలేకపోతున్న ప్రజలకు సాంత్వన అందిస్తూ అవసరమయ్యే కీలక ధ్రువపత్రాలను అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీ మార్లేళ్ళ భీష్ముడు, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ కర్రి గంగారాజు, మాజీ ఎంపీటీసీ నిడదవోలు శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం కార్యదర్శి పోతుల ప్రసాద్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రూ. 6.7 కోట్లతో రాధేయపాలెం అభివృద్ధి

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- రాధేయపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం



రాధేయపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో జక్కంపూడి రాజా

రాజానగరం: గత పాలకులు నిర్లక్ష్యం చూపిన రాధేయపాలెం గ్రామాభివృద్ధికి గడచిన నాలుగేళ్లలో తమ ప్రభుత్వం ద్వారా రూ.6.07కోట్ల నిధులు వెచ్చించామని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆ గ్రామంలో శనివారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ గ్రామం వివిధ అభివృద్ధి పనులతో కళకళలాడుతుందన్నారు. గ్రామంలో లోఓల్టేజ్ సమస్యను శాశ్వతంగా నివారిస్తూ రూ.2.85 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. గ్రామంలో 218 మంది పేదలకు ఇంటి స్థలాలు అందించామన్నారు. అనారోగ్యాలతో బాధపడుతున్న స్థానికులను పరామర్శించి, అవసరమైన వారికి మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల పథకాలను, సేవలను సత్వరం ప్రజలకు అందించడంతోపాటు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా వేగిరమే పరిష్కరించే దిశగా సీఎం జగన్ 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని అమలుచేస్తున్నారని ఎమ్మెల్యే రాజా తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, సర్పంచ్ నురుకుర్తి దుర్గ, ఉపసర్పంచ్ రావూరి సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ వీర్రాజు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.

సమాజోద్ధరణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ఉపాధ్యాయులను సత్కరించిన జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: సమాజోద్ధరణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. శనివారం కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో బదిలీ అయిన 60 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విజయలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలమన్నారు. జగనన్న ప్రభుత్వం విద్యాభివృద్ధి ఎన్నో పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. పీఆర్టీయూ ఆధ్వర్యంలో మండలానికి బదిలీపై వచ్చిన, ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులందరిని శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి, మెమోంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకుడు రాజారావు, జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఎంఈఓ కుశల వదొర, ఎమ్మెల్యే సతీమణి రాజశ్రీ, కోరుకొండ ఉపసర్పంచ్ నేతుల చిన్ని, వైఎస్సార్ సీపీ నాయకులు తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి, పసుపులేటి బుల్లియ్యనాయుడు, రామకృష్ణ, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం ప్రకటన

[illegible]

సీ.నెం.	ఆర్.ఎస్.నెం.	విస్తీర్ణం	భూమి ఉన్న గ్రామము	ధరావత్తు (రూ.ల్లో)
1	307/1	5.66	తూర్పుగోదావరి జిల్లా, అనపర్తి మండలం, [illegible] గ్రామం	20,000
2 3 4	214 213 214	14.50	డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రపురం మండలం, [illegible]	35,000
5	221/7	0.38	డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రపురం మండలం, [illegible]	3000

రామచంద్రపురం, తే. 24-06-2023 | సం/- కార్యనిర్వహణాధికారి, [illegible]

ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష



పందలపాకలో జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్వేను పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ భవాని



పురుషోత్తపట్నం గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ రాజు



జగనన్న సురక్షపై అవగాహన కల్పిస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు

బిక్కవోలు: ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమమని ఈవోపీఆర్డీ భవాని అన్నారు. శనివారం ఆమె మండలంలోని పందలపాక గ్రామంలోని వలంటీర్ల సర్వేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం 21 సచివాలయాల పరిధిలో నెల రోజుల పాటు ఉంటుందన్నారు. సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం పందలపాకలో వలంటీర్లతో కలిసి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సచివాలయ సిబ్బంది మణికంఠ, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా 'జగనన్న సురక్ష'

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నం, కూనవరంలలో ఇంటింటికీ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. శనివారం పురుషోత్తపట్నంలో తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు, ఈవోపీఆర్డీ మూర్తి, వీఆర్వో చిన్నా, కూనవరంలో ఎంపీడీఓ కె.రమేష్, ఆర్ఐ లక్ష్మి, సచివాలయం సిబ్బంది, గ్రామ వలంటీర్లు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ఇంటింటికీ వెళ్లి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూరింది తెలియజేసి, ఏమైన సమస్యలు ఉన్నాయా, పథకాలు అందుతున్నాయని ఆరా తీశారు. అర్హులై అందని వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకున్న వారికి వారం రోజుల్లో అందజేస్తామన్నారు.

జగనన్న సురక్ష పథకం ప్రారంభం

పెదపూడి: జగనన్న సురక్ష పథకాన్ని అధికారులు, సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు విజయవంతం చేయాలని ఎంపీడీఓ పి.విజయభాస్కర్, తహసీల్దార్ టి.సుభాష్‌లు పిలుపునిచ్చారు. రామేశ్వరంలో శనివారం జగనన్న సురక్ష పథకాన్ని వారిద్దరూ ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్ర మంలో ఎంపీడీఓ పి.విజయభాస్కర్, తహసీల్దార్ టి.సుభాష్‌లు మాట్లాడారు. గ్రామ సర్పంచ్ కొటికలపూడి చినబాబు, సచివాలయ కార్యదర్శి అచ్చిరాజు, వీఆర్వో కరెడ్ల రమేష్ బాబు, ఆలయ కమిటీ చైర్మన్ గంగుమళ్ల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

గోకవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్ అన్నారు. మండలంలోని వెదురుపాక, అచ్యుతాపురం గ్రామాల్లో జగనన్న సురక్షపై శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. అర్హత ఉండి ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకపోతే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గుర్తించి లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల శ్రీను, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హత ఉంటే సంక్షేమం అందాలి

రంగంపేట: అర్హత ఉంటే ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకం అందించాలన్న ఉన్నత సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నారని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని దొడ్డిగుంట సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న సురక్షను అందరూ బాధ్యతాయుతంగా చేపట్టాలన్నారు. గ్రామ సర్పంచ్ కారి సంజీవరావు, ఎంపీటీసీ మడికి లక్ష్మి, పంచాయితీ కార్యదర్శి మణికుమార్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.